విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 11, డిసెంబర్ 2025

ఓటర్ మ్యాపింగ్ సర్వే

విశాలాంధ్ర-కణేకల్లు : స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతంలో బుధవారం రక్తసంబంధీకుల ఓటర్ మ్యాపింగ్ సర్వేను 129 బూత్ నంబర్ పరిధిలో ప్రోజని ఆధ్వర్యంలో చేపట్టారు. బస్టాండ్ ఏరియాలోని అన్ని వీధులను కవర్ చేస్తూ, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల రక్తసంబంధ వివరాలను సేకరించారు. సచివాలయానికి చెందిన బూత్ లెవెల్ సర్వే ఆఫీసర్ శర్మాస్వలి, 129 బూత్ కన్వీనర్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సర్వే ద్వారా కుటుంబాల మధ్య రక్తసంబంధాలను ఆధారం చేసుకుని ఓటర్ డేటాను అప్‌డేట్ చేయడం, భవిష్యత్ ఎన్నికల్లో సమగ్ర ఓటర్ జాబితా తయారీకి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాన్నారు.

మానవ హక్కుల దినోత్సవం ప్రతిజ్ఞ

విశాలాంధ్ర-అనంతపురం: ప్రభుత్వ కళాశాల (స్వ) అనంతపురము, ప్రధానాచార్యులు డాక్టర్ పద్మశ్రీ అధ్యక్షతన, మహిళ సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ బృంద ఆధ్వర్యంలో, మహిళా సాధికారత విభాగం వారిచే బుధవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు డాక్టర్ పద్మశ్రీ మహిళల హక్కులను లింగ, వర విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలన్నారు. నేటి యువతకు హక్కులపై ప్రత్యేక అవగాహన కల్పించాలని, స్వేఛ్ఛ, వేతనం కోసం నేటికీ మహిళలు పోరాటం కొనసాగిస్తున్నారని తెలిపారు. డాక్టర్ బృంద మహిళల హక్కులు సాధికారతకు, పేదరిక నిర్మూలనకు, ఆరోగ్యకర సమాజ శ్రేయస్సుకు హితకరమైనవని తెలిపి మహిళా అధ్యాపకులందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాలన్నింటినీ ప్రత్యేక పంచాయతీగా గుర్తించండి

విశాలాంధ్ర-శెట్టూరు: మండల పరిధిలో పర్ల చేడు,కాడప్ప గారితోట, వడ్డుపాల్యం, గండయ్య దొడ్డి,బుడ్డయ్యదొడ్డి గ్రామాలు కలిపి ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని బుధవారం ఆయా గ్రామాల ప్రజలు మండల తాహసిల్దార్‌కి ఈశ్వరమ్మకు, ఎంపీడీవో జిలన్ భాష విన్నమించారు అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ పెరుగు పాల్యం గ్రామ పంచాయతీలో ఉన్నవి కాకపోతే ప్రభుత్వము పరిపాలన వికేంద్రీకరణ అభివ ృద్ధి కొరకు పంచాయతీలను విభజించుట ప్రభుత్వం జీవో ఇచ్చింది కావున పెరుగు పాలెం లో ఉన్న మా గ్రామాన్నింటిని విభజించి ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని వారు అధికారులకు కోరారు ఈ కార్యక్రమంలో హరీష్, అశోక్, కిష్టప్ప, హనుమంతరాయుడు, లింగరాజు, రఘు, శివన్న, బైరప్ప,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యే చేయూత..

రూ.32 వేల క్రికెట్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ -శ్రీనివాసులు మండలంలోని ఉద్దేహాళ్ హైస్కూల్ విద్యార్థుల క్రీడాభివృద్ధికి చేయూత అందించారు.ఈనెల 5న ఉద్దేహాళ్ హైస్కూల్లో జరిగిని మెగా పిటిఎం 3.0 కార్యక్రమంలో పాల్గొన్న సందరరేగా అభ్యర్ధన మేరకు విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు బుధవారం కాలవ శ్రీనివాసులు కుమార్తె కాలవ గౌతమి రూ.32 వేల విలువ చేసే క్రికెట్ కిట్టును ఆ పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, ప్రదానోపాధ్యాయులు, ఆదిశేషు, ఉపాధ్యాయులు సుదీర్‌కుమార్, ఆక్కులప్ప విద్యార్థుల క్రీడాభి వృద్ధికి తోడ్పడినందుకు ఎమ్మెల్యే కాలవ కు కృతజ్ఞతలు తెలిపారు.

జేఎన్టీయూ అధ్యాపకులకు అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగాధి పతి డాక్టర్ కే.కళ్యాణి రాధ, డాక్టర్ బి. ఓం ప్రకాష్ సంయుక్తం గా ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అప్లైడ్ ఫిజిక్స్ ఇంజినీరింగ్ ఇన్నోవేషన్ అండ్ సస్ టైనబుల్ టెక్నాలజీస్ . ఐ సి ఎఈఎస్ - 2025 నందు "మోరింగా ఒలీఫెరా ఆయిల్ డీజిల్ మిశ్రమంతో కూడిన డీజిల్ ఇంధనం పనితీరు, ఉద్గార లక్షణాలపై ఎగ్జాస్ట్ గ్యాస్ నియంత్రణ ప్రభావం అనే అంశంపై పరిశోధన పత్రాన్ని ఆవిష్కరించేందుకు అవార్డును ప్రధానం చేశారు. ఉత్తమ పేపర్ అవార్డు గ్రహీతలను ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య ఓఎస్‌డి వీసీ ఆచార్య ఎన్.దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం..

విశాలాంధ్ర-గుత్తి: తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వీఆర్ఏ, రెవిన్యూ కుటుంబాలకు తహసిల్దార్ పుణ్యవతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్, గుండె వంటి పలు రోగాలను ఉచితంగా పరీక్షలు చేశారు. డాక్టర్లు ఫిజియోథెరపీ గురించి రెవిన్యూ సిబ్బందికి చక్కటి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పుణ్యవతి, డిప్యూటీ తహసిల్దార్ లలిత, ఆర్ఐ అంజన్ ప్రసాద్,వైద్యులు వెంకటేష్, వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్,వీఆర్వోలు సురేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన వివాహిత బళ్లారి విమ్స్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకోంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన వివరాలు మేరకు విడపనకల్లు గ్రామానికి చెందిన సరోజమ్మ, పెద్దలింగన్న కుమార్తె జయలక్ష్మి (23) అనే యువతిని కురువళ్లి గ్రామానికి చెందిన గురుస్వామికి ఇచ్చి 3 నెలల క్రితం వివాహం చేశారు. గత నెల 17న ఇంట్లో ఎవరు లేని సమయ0లో పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవానికి పోస్టుమారం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొడవలు సృష్టిస్తే ఊరుకునేది లేదు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : గత కొన్ని సంవత్సరాలుగా అనంతపురం ప్రభుత్వ హాస్పిటల్ మెయిన్ గేట్ ముందర అనేకమంది కుటుంబ పోషణ కోసం అంబులెన్స్ డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారని, అయితే కొందరు స్వార్థపరులు ఒక పోలీసు అధికారిని లోపరుచు కొని అంబులెన్స్ డ్రైవర్‌ను ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ అంబేద్కర్ అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఏఐటీయూసీ బోర్డు దగ్గర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నగర అధ్యక్షులు జి.చిరంజీవి, కార్యదర్శి వి.కృష్ణుడు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేస్తామని పేరుతో దందా నిర్వహిస్తుంటే కొందరు వ్యక్తులు చేసే అరాచక పనులు సరిపోక అంబులెన్స్ డ్రైవర్ యూనియన్ కొంత మంది వ్యక్తులు ఏఐటియుసి యూనియన్‌లో చేరడం చేరారన్నారు. చేరిన తర్వాత అందరూ సానుకూలంగా, శాంతియుతంగా సీరియల్ పద్ధతిలో జాగ్రత్తగా కలిసి సహకరించుకోవాలని ఏఐటీయూసీగా సూచించామన్నారు. గిట్టని వారు వికృత చేష్టలు చేస్తే సహించమని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. కార్మికుల మధ్య జరిగిన సంఘటనను చర్చించి ఇరువురి మధ్య గొడవలు లేకుండ నచ్చజెప్పాల్సిన పోలీసు అధికారి ఏఐటీయూసీ కార్యకర్తలపై కేసులు పెడతామని బెదిరించడం ఎంతవరకు సబబుని వారు పోలీసు అధికారిని ప్రశ్నించారు. కేసులకు భయపడి వెనక్కి తగ్గుతామని అనుకుంటే ఆ పోలీసు అధికారి భ్రమేనని కార్మికులకు న్యాయం జరిగే వరకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారి మారాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు కృష్ణనాయక్, అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ్, వీర, షేక్షావలి, రోహిత్, నవీన్,బద్రి, మార్కండేయ, గోపాల్, హరినాయక్, గంగ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

-అనంతపురం డీఎస్పీ మహబూబ్ బాషా

విశాలాంధ్ర-రాప్తాడు: 18 ఏళ్ల లోపు పిల్లలను లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అనంతపురం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా హెచ్చరించారు. రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి, మైనారిటీ కాలనీ, సవీర నర్సింగ్ కాలేజీలో బుధవారం మహిళలపై జరుగుతున్న నేరాల గురించి, ఫోక్సో కేసుల గురించి అవగాహన కల్పించారు. మహబూబ్ బాషా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మహిళలు, చిన్నారులు, యువతులపై వేధింపులు జరుగుతుండడం బాధాకరమని, వాటిపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవశ్యకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ, పిల్లల అశ్లీల చిత్రాలు (చైల్డ్ పోర్నోగ్రఫీ) వంటి నేరాల గురించి వివరించారు. కేసుల విచారణలో పిల్లల సౌలభ్యాన్ని, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విచారణలో ప్రత్యేక విధానాలు అనుసరిస్తామన్నారు. వరల్డ్ విజన్ ఇండియా నిర్వహించిన 2017 సర్వే ప్రకారం, భారతదేశంలో ప్రతి ఇద్దరు పిల్లలలో ఒకరు లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. పోలీసు సహాయం కోసం డయల్ 100, మహిళల హెల్ప్ లైన్ డయల్1091, 181, పిల్లలు ఆపదలో ఉన్నప్పుడు 1098 నంబర్ను సంప్రదించాలన్నారు కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హలో యువత మేలుకో పోస్టర్లు విడుదల చేసిన ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం: రాష్ట్రవ్యాప్తంగా యువతలో వేగంగా పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం, గుట్కా-గంజాయి-మద్యం వంటి చెడు వ్యసనాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఒక సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా "హలో యువత మేలుకో చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో" పేరుతో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఎస్పీ జగదీష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... "ప్రతి రోజూ నమోదు అయ్యే కేసుల్లో పెద్ద సంఖ్య యువతలో వ్యసనాలకు సంబంధించినవే డ్రగ్స్, గుట్కా, మద్యం వంటి ఉపద్రవాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాదు విద్యను, ఉపాధిని, భవిష్యత్తును, కుటుంబ శాంతిని పూర్తిగా నాశనం చేస్తున్నాయన్నారు. యువతను వ్యసనాల బారిన పడదీయడానికి ప్రయత్నించే మాఫియాలు, అక్రమ వ్యాపారులపై సామాజిక జాగ్రత్త తప్పనిసరి అని పేర్కొన్నారు. యువజన సంఘాలు ముందుకు వచ్చి సామాజిక బాధ్యతతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ... "రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కాలేజీ, ప్రతి గ్రామం, ప్రతి నగరంలో యువజన-విద్యార్థి వర్గాలలో విస్తృత ప్రచారం ప్రారంభి స్తున్నామన్నారు. అవగాహన సమావేశాలు, ర్యాలీలు, కళాజాథాలు, సెమినార్ల ద్వారా 'వ్యసనాలన్నీ వినాశనాలకు ప్రారంభం' అనే సందేశాన్ని ప్రతి యువకునికి చేరుస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కార్యదర్శులు ఎం. ఆనంద్, ఎస్. శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఏ. సురేంద్ర, నాయకులు బండారు తేజ, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ..

విశాలాంధ్ర-ఉరవకొండ: మండలం షెక్షాన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ బోయ లింగన్న సొంత నిధులతో ప్రతిష్ట చేసిన గాంధీ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ఆవిష్కరించారు. సభ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహానుభావుని విగ్రహావిష్కరణకు అవకాశం కల్పించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు, సర్పంచ్ లింగన్నకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు. శాంతి, అహింస, సేవలను ఆయుధాలుగా బ్రిటిష్ వారితో స్వాతంత్ర పోరాటం చేసి భారతదేశానికి స్వాతంత్రాన్ని సాధించి పెట్టారని, అలాంటి మహనీయుని అడుగుజాడలలో నడుస్తూ మనమందరం నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, షెక్షాన్‌పల్లి సర్పంచ్ బోయ లింగన్న, రేణు మాకులపల్లి సర్పంచ్ రామాంజనేయులు, లత్తవరం సర్పంచ్ వంశీకృష్ణ, జరుట్లరాంపురం సర్పంచ్ తిరుపాల్ యాదవ్, మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ రమణయాదవ్ పాల్గొన్నారు.

గుంతకల్లులో కలెక్టర్ ఆనంద్ సుడిగాలి పర్యటన..

- రైల్వే డీఆర్ఎంతో భేటీ
- పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత రావాలని ఎంఈఓలకు దిశానిర్దేశం

విశాలాంధ్ర-గుంతకల్లు : స్థానిక రైల్వే డిఆర్ఎం కార్యాలయం, మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ ఓ.ఆనంద్ సందర్శించారు. గుంతకల్ డిఆర్ఎంను కలిశారు. జిల్లా నుండి బొంబాయి వివిధ ప్రాంతాలకు రవాణా చేయాలంటే అరటి పండ్ల ట్రేడర్స్‌కు ఖర్చులు చార్జీలు ఎక్కువుతున్నాయని అందుకే రైల్వే శాఖ సహకారం అందిస్తే రవాణా చేసుకోవడానికి సులువుగా ఉంటుందని ట్రేడర్స్‌కు రవాణా చార్జీలు తగ్గుతాని తెలిపారు. దీనిపై డీఆర్ఎం పై అధికారులతో చర్చిస్తామని చెప్పారు. ముఖ్యంగా పదవ తరగతి 100 శాతం రాష్ట్రంలో ఉత్తీర్ణత సాధించాలని.. రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం జరిగిందని అందులో భాగంగా గుంతకల్ పట్టణంలో ఇన్స్పెక్షన్ కోసం వచ్చామన్నారు. ప్రతి గ్రామానికి 149 క్లినిక్లు వచ్చాయన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో గ్రామాల్లో ప్రారంభిస్తామని అన్నారు. అలాగే పట్టణంలో మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి రాష్ట్ర స్థాయిలో 100 శాతం మంచి మార్కులుతో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను స్కూల్ హెడ్మాస్టర్‌కు దిశా నిర్దేశం చేశారు. పిల్లలు ఎలా చదువుతున్నారని అడిగారు స్వయానా ఆయనే బోర్డుపై పదవ తరగతి లెక్కను చేసి చూపించారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని పరీక్షించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాసులు,తాసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో దేవదాస్, మున్సిపల్ కమిషనర్ నయీమ్ మహమ్మద్, వివిధ శాఖల అధికారులు, టీచర్స్ పాల్గొన్నారు.

కబ్జా అయిన ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వకార్యాలయాలు నిర్మించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: ప్రభుత్వ భూములను భూకబ్జా దారుల నుండి కాపాడి ఆ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.గోవింద్ అన్నారు. బుధవారం గుంతకల్‌కు వచ్చిన కలెక్టర్‌కు ఆనందకు సీపీఐ బృందం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం గోవింద్ మాట్లాడుతూ పట్టణంలో హనుమాన్ సర్కిల్‌లో కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములను సర్వేనెంబర్ 42 4/బి, 412-2 లలో 54 సెంట్లు స్థలంను భూ కబ్జాదారులు ఆక్రమించి కంచ వేశారని, ఆ భూమి కబ్జా కాకుండా ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో ప్రభుత్వ కార్యాలయాలు కట్టించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుఎం.వీరభద్ర స్వామి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బి.మహేష్ సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్.గోపీనాథ్ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి.గౌస్ సిపిఐ రూరల్ కార్యదర్శి పి.రాము రాయల్ సహాయ కార్యదర్శి రామాంజనేయులు ఏఐటీయూసీ మండల కార్యదర్శి కె.ఈశ్వరయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే.దేవేంద్ర, జనసేవ దళ్ రాష్ట్ర ఇన్స్పెక్టర్ కె.మురళి, ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ అధ్యక్షులు వి.వినోద్, సిపిఐ నాయకులు డైమండై నూర్, మధుబాబు, నూరుమహమ్మద్, నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతులకు కన్నీరు తెప్పిస్తున్న విల్ట్ తెగులు..

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల పరిధిలో పలు గ్రామాల్లో మిరప పంటను విల్ట్ తెగులు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వందలాది ఎకరాల్లో పంట మొత్తం ఎండిపోవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు, అధిక తేమ, నీరు నిలవడం వల్ల ఈ తెగులు వేగంగా వ్యాపించి మొక్కలు అకస్మాత్తుగా వాడిపోయి, ఎండిపోతున్నాయి. సుమారు వందల ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతినిందని ప్రాథమిక అంచనా క్వింటాలుకు మంచి ధర వస్తుందనుకున్న తరుణంలో ఈ విపత్తు సంభవించిన కారణంగా రైతుల ఆవేదన పడుతున్నారు. వారు పెట్టిన పెట్టుబడి, ఆశలు, అప్పుల కూడా అందుతాయా లేదని రైతులు బాధను వ్యక్తపరుస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో తెగులు సోకడంతో తీవ్రంగా నష్టపోయాం. ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి కోసం అప్పులు చేసి పంట పండిస్తే, ఇప్పుడు వాటిని ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గతేడాది నష్టాల నుంచి కోలుకోకముందే మరో దెబ్బ అని కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరానికి చొప్పున నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కులాలను రెచ్చగొట్టే రాజకీయాలు వద్దు

వైసీపీకి ఎమ్మెల్యే సురేంద్రబాబు సలహా
టీడీపీలో చేరిన ఇండిపెండెట్ కౌన్సిలర్ గౌతమి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సమక్షంలో మున్సిపాలిటీ 15వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ టీ.గౌతమి తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని స్వయంగా పార్టీ కండువా కప్పి ఆమెకు ఆహ్వానం పలికారు. కౌన్సిలర్ గౌతమి మాట్లాడుతూ కేవలం కుల రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టే వైసీపీ నాయకులకు గుణపాఠం చెప్పాలనే ఉద్దేశంతోనే టీడీపీలో చేరానని తెలిపారు. ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ అభివృద్ధి కోసం పని చేసే ప్రతి ఒక్కరు తమతో కలిసి నడుస్తారు. కానీ కేవలం కుల రాజకీయాలతో పదవులు కాపాడుకోవాలనే వారు ప్రజల్లో నిలవరు," అని స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా కళ్యాణదుర్గం ప్రాంతంలోని కౌన్సిలర్లను కులం పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని వైసీపీ నాయకులు ప్రయత్నించడం దౌర్భాగ్యం అన్నారు. ఇప్పటికైనా కులా రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జున రామ్మోహన్ చౌదరి లక్ష్మీనారాయణ రామాంజనేయులు తిప్పేస్వామి, గురుప్రసాద్, మండల కన్వీనర్లు గోళ్ళ వెంకటేశులు, శివన్న, ధనుంజయ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై ప్రజా వ్యతిరేకత

విశాలాంధ్ర-యాడికి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాడిపత్రి నియోజకవర్గం నుంచి సేకరించిన దాదాపు 40,000 సంతకాల వినతిపత్రాలను బుధవారం అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయానికి పంపించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి, యాడికి మండలం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు, బ్రహ్మానంద రెడ్డి, వైఎస్ఆర్సిపి స్టేట్ జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, యాడికి వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ ఎం.సంజీవరాయుడు, రోశిరెడ్డి పాల్గొన్నారు.

ముంచిన పప్పు శనగల వ్యాపారి

రైతులకు రూ.2 కోట్ల 68 లక్షలు కుచ్చటోపి

విశాలాంధ్ర-బెలుగుప్ప: బెలుగుప్ప మండలానికి చెందిన విక్రమ్ గత కొన్ని సంవత్సరాలుగా పప్పు శనగలు వ్యాపారం చేస్తున్నాడు కొంతమంది రైతులు నమ్మి పప్పు శనగలు వ్యాపారికి అనామతు లో పప్పు సెనగలను పట్టించినారు అయితే గత మూడు సంవత్సరాలుగా రైతులు అమ్మిన పప్పు సెనగ దాదాపు రెండు కోట్ల 68 లక్షలు రైతులకు చెల్లించకుండా పరారయ్యాడు 2025 సంవత్సరం మార్చి నెలలో శనగల వ్యాపారి విక్రంపై బెలుగుప్ప పోలీస్ స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేశారు ఎస్ఐ శివ విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ అనంతపురం ఎస్పీ గుంటకల్ డిఎస్పి ఆదేశాలు మేరకు పర్యవేక్షణలో గాలింపు చేపట్టగా ఎస్ఐ శివ పోలీస్ సిబ్బందితో గురువారం గుండ్లపల్లి క్రాసు దగ్గర శనగల వ్యాపారి విక్రమ్ ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని తెలిపారు కార్యక్రమంలో ఎస్ఐ శివ పోలీసులు మహమ్మద్ భాష నాగభూషణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

విశాలాంధ్ర-కణేకల్లు: మండల కేంద్రంలోని చెరువు కట్ట దగ్గర వెలిసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధి కొరకు రూ.2 లక్షలలను చిక్కన్న, నాగప్ప గురుస్వాములు ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ అధ్యక్షులు నాగభూషణ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన సత్రం కొరకు దాదాపు 15 చదరాలతో 25 లక్షలతో నూతన భవనాన్ని నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించామన్నారు.సహాయార్థం చిక్కన్న గురుస్వామి లక్ష రూపాయలు నాగప్ప గురుస్వామి లక్ష రూపాయలు అందించారన్నారు. కార్యక్రమంలో అన్నదాన సమితి ప్రధాన కార్యదర్శి రాపా ప్రకాష్, సెక్రెటరీ సోమశేఖర్ రెడ్డి, ట్రెజరర్ సుధాకర్,సాయి చరణ్,మణికంఠ, గోపాల్ స్వామి, లింగరాజు, వినయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆదాయమే లక్ష్యం

ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి

విశాలాంధ్ర-తాడిపత్రి: మున్సిపాలిటీ ఆదాయమే తమ లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే జెసి. అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జెసి. నాగిరెడ్డి మునిసిపల్ కాంప్లెక్స్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. శివరామకృష్ణ ఆధ్వర్యంలో మున్సిపల్ షాపింగ్ రూమ్స్ దాదాపు 75 లక్షలతో షాపింగ్ రూమ్స్ నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి హాజరై, షాపింగ్ రూమ్స్‌కు భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఆదాయం రావాలంటే మున్సిపాలిటీ ఖాళీ స్థలాలలో షాపింగ్ నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు తలారి అరుణ, షేక్షావలి, కౌన్సిలర్లు పి.తస్మిన్ తాజ్, రసూల్ బి, కోట సుశీలమ్మ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని రాయల చెరువు గ్రామంలో మంగళవారం సాయంత్రం స్టేట్ బ్యాంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్ముంపల్లె గ్రామానికి చెందిన బండి శ్రీనివాసులు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మరణించారు. ఈ సంఘటనపై మృతుడి భార్య రామాంజినమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాజిపేయి విగ్రహావిష్కరణపై సమావేశం

విశాలాంధ్ర-కూడేరు: బీజేపీ కూడేరు మండల కమిటీ అధ్యక్షులు నాగరాజు, ఇంచార్జ్ చావన్ రంజిత్ కుమార్ నాయక్, జనసేన మండల అధ్యక్షులు నగేష్ ఆధ్వర్యంలో అటల్,మోడీ సుపరిపరిపాలన కార్యక్రమంపై రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ సూచనల మేరకు గోడ పత్రికలు విడుదల చేయడం జరిగింది. సుపరిపాలన యాత్ర డిసెంబర్ 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యేలు మంత్రు పాల్గొంటారని, అనంతపురంలో వాజ్పేయి విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

క్యాన్సర్ బాలునికి అండగా లోకేష్

ఎమ్మెల్యే చొరవతో రూ.12లక్షల సాయం

విశాలాంధ్ర - అనంతపురం రూరల్ : 12ఏళ్ల వయసులోనే ప్రాణంతకమైన బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అనంతపురం నగరంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన 12 ఏళ్ల చిన్నికృష్ణ ఉదయ్ పవన్ కుమార్ బాలునికి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారు. బెంగుళూరులోని శ్రీ శంకర క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా బాలుడికి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్, కీమోథెరపీ కోసం లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. తమకు సాయం అందించాలంటూ గత నెలలో మంత్రి నారా లోకేష్ కి అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో కుటుంబసభ్యులు కలిశారు. బాలుని గురించి తెలుసుకోవాలని మంత్రి లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకుని బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన కూడా మానవత్వంతో స్పందించారు. సీఎంఆర్ఎఫ్ పరిధిలో చికిత్సలకు ముందే ఎల్.ఓ.సి ద్వారా రూ.12 లక్షలు సాయం అందజేశారు. దీనిపై చిన్నారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేకంగా .కృతజ్ఞతలు తెలిపారు. తమ బిడ్డ కోసం ఇంత సాయం చేస్తున్న మిమ్మల్ని ఎప్పటికీ మరువలేమన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం మహర్షి దయానంద గురుకుల పాఠశాల లో బుధవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మానవ హక్కుల చట్టంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ గుత్తి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షేక్షావలి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన షేక్షావలి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక మానవునికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంది ఒకరి హక్కుల్ని ఒకరు భంగం కలిగించకూడదు కలిగిస్తే చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మండల అధ్యక్షుడు విద్య ధర రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మీ హక్కులను వినియోగిం చుకోవాలని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం పట్టణంలో గురువారం జరగనున్న మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం, అలాగే ధర్మవరంలో ప్రారంభం కానున్న అటల్-మోడీ సుపరిపాలన యాత్ర ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌తో కలసి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యవేక్షించారు. సదస్సు ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలకు సంబంధించిన విభాగాలు, వేదిక నిర్వహణ, పార్కింగ్, నీటి-వైద్య సేవలు తదితర అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించి ఎటువంటి లోపాలు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు, సమన్వయ బృందాలకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే రోజు ధర్మవరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్ల పంపిణీకి జరుగుతున్న ఏర్పాట్లు కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.... ధర్మవరం పట్టణం డిసెంబర్ 12 చారిత్రాత్మక రోజును చూస్తోందని పేర్కొన్నారు. దేశానికి దిశానిర్దేశం చేసిన, విలువల రాజకీయాన్ని నిలబెట్టిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ప్రజల మధ్య ప్రతిష్ఠించడం ధర్మవరం కోసం గర్వకారణమని తెలిపారు.

విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కళా జ్యోతి సర్కిల్లో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా వారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ప్రోగ్రాం జోనల్ ఇంచార్జ్ నంది రెడ్డి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బిజెపి అధ్యక్షులు మాధవ్, కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, చేనేత జౌళి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపూర్ పార్లమెంటు సభ్యులు పార్థసారధితో పాటు కేంద్ర, రాష్ట్ర ఇతర మంత్రులు, రాష్ట్ర జిల్లాల నుండి బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, రానున్నారని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ వినతి..

విశాలాంధ్ర-సోమందేపల్లి: రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మండల ఉప తాసిల్దార్ రెడ్డి శేఖర్‌కి బుధవారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది, అనంతరం మాట్లాడుతూ పత్తి మొక్కజొన్న అరటి తదితర పంటలకు రైతులు పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని కోరారు. భూములేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వాలు ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి సిపిఐ మండల కార్యదర్శి రాజగోపాల్ సహాయ కార్యదర్శి అంజనమ్మ, సిపిఐ మండల సభ్యులు శ్రీకాంత్, చంద్రశేఖర్, మల్లేష్, సునీల్, రాజేష్, అనిల్, మహిళా సభ్యురాలు, నూర్జాన్, లక్ష్మీ నరసమ్మ పాల్గొన్నారు.

పాలసముద్రం ప్రైమరీ స్కూల్‌కు దాత శివప్ప సాయం

విశాలాంధ్ర-గోరంట్ల: పాలసముద్రం మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఈ నెల 5 వ తేదీన జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం స్థానికుడు ముద్దు శివప్ప (పాఠశాల కమిటీ సభ్యులు) తనవంతుగా 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని హామీ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా బుధవారం పాఠశాలలె గోరంట్ల మండల విద్యాశాఖాధికారి గోపాల్ ఆధ్వర్యంలో 30 వేల రూపాయలను నగదు రూపంలో ప్రధానోపాధ్యాయులు నీలం అశోక్‌కి ఇవ్వడం ద్వారా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఎంఈఓ పాఠశాల సిబ్బంది దాత సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయచంద్ర నాయక్, నాగలీల, సంప్రీతి బాయి, సునంద పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర అమలు చేయాలి

విశాలాంధ్ర-బత్తలపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి, భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయాదవ్, రాష్ట్ర రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, రాష్ట్ర చేతివృత్తుల అధ్యక్షులుజింక చలపతి, మండల సిపిఐ కార్యదర్శి బండల వెంకటేష్ తో కలిసి బుధవారం బత్తలపల్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, బత్తలపల్లి ఎమ్మార్వో స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. వేమయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారని ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంఘం గౌర అధ్యక్షులు కుళ్లాయప్ప, మండల సహాయ కార్యదర్శి ఓబులేసు, దళిత హక్కుల పోరాట సమితి రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శి చిన్న పెద్దన్న, నాగభూషణ, సిపిఐ కార్యవర్గ సభ్యులు నారాయణ, రామంజి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి.

విశాలాంధ్ర-లేపాక్షి : గ్రామీణ ప్రాంతాల నుండి విద్యాభ్యాసం కోసం పాఠశాలకు వచ్చి హాస్టల్ సదుపాయంతో విద్యనభ్యసించే విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించడమే కాకుండా ప్రభుత్వము అందజేసే నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుందర్ రాజుకు సూచించారు. బుధవారం సాయంత్రం లేపాక్షిలోని గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలోని వంట గదిలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యమైన భోజనం ఆకుకూరలు కూరగాయలు పాలు గుడ్లు తదితర వాటిని పరిశీలించి చిన్నచిన్న పొరపాట్లకు అవకాశం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన ఆమె పాఠశాలలో రోజు నిర్వహించే మెనూ అందుతున్న సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. లేపాక్షిలోని మినీ అంగన్వాడిని తనిఖీ చేసి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. అంతకుముందు దుర్గా వీరభద్ర పాపనేశ్వర స్వాముల ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఈ పర్యటనలో సిడిపిఓ వరలక్ష్మి ఎంఈఓ నాగరాజు నాయక్ కులయప్ప సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోండి..

విశాలాంధ్ర-పుట్టపర్తి: రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయిందని రైతుల ఆత్మహత్యలు జరుగుతూనే ఉన్నాయని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. నిబంధనలు సడలించి ధాన్యం, మొక్క జొన్న, పత్తి పంటలను మద్దతు ధరలు కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.భూమిలేని కౌలు రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంకు రుణాలు, మార్కెట్లో ధరలు లేక నష్టపోతున్న అరటి, నిమ్మ, బత్తాయి రైతులను ఆదుకోవాల న్నారు. మొంథా తుఫాను, అధిక వర్షాలు, వరదలు కరువు వలన పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు వెంటనే ఇన్పుట్ సబ్సిడీ ఉచిత పంటల భీమా పథకం అమలు చేయాలన్నారు. వ్యవసాయ అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు, కౌలు రైతు కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. రైతు వ్యతిరేక విద్యుత్ బిల్లు, సీడ్ బిల్లును వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. రొయ్యలు, చేపలకు కూడా మద్దతు ధరలను ప్రకటించి ఆక్వా రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి. సీడు, ఫీడ్కు, విద్యుత్తుకు సబ్సిడీ అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్, రైతు సంఘం నాయకులు మహదేవ్, బాలరాజు, రామంజి తదితరులు పాల్గొన్నారు.

ఆప్తాలమిక్ అసిస్టెంట్ తప్పనిసరి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని అప్టికల్స్ షాపుల యందు కంటి పరీక్షలను అప్తాలని అసిస్టెంట్ మాత్రమే పరీక్షించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి కంటి వైద్య నిపుణులు డాక్టర్ అనురాధ తెలిపారు. బుధవారం పట్టణంలోని అప్టికల్స్ షాపుల యజమానులతో,ఆప్తాలమిక్ అసిస్టెంట్లతో పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కంటి పరీక్షలను నాణ్యతగా చూడాలని, ఇతర వ్యక్తుల చేత చేయించితే తప్పక చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కొన్ని అప్టికల్స్ పై ఫిర్యాదులు అందాయని, ఇందులో భాగంగానే రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి, కంటి నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు సమక్షంలో కంటి అద్దముల షాపుల నిర్వహిస్తున్న అర్హతలను తనిఖీ చేశామన్నారు. కంటి పరీక్ష కేంద్రాలల్లో మందులు రోగులకు ఇచ్చిన, లేదా సిఫార్సు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హిందూ సమ్మేళనం వాల్‌పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం కాలేజీ గ్రౌండ్లో డిసెంబర్ 21సాయంత్రం 4.00 నుండి నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మంత్రి సత్య కుమార్‌యాదవ్ బుధవారం మంత్రికార్యాలయంలో ఆవిష్కరించారని పులి చర్ల వేణుగోపాల్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ హిందువులు అందరూ, కులాలకు, వర్ణాలకు, వర్గాలకు, అతీతంగా, పిల్లలు పెద్దలు కుటుంబ సమేతంగా వందలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి కార్యదర్శి, సికె వివేకానంద, సింగనమల కిషోర్, బిజెపి సీనియర్ నాయకులు అంబటి సతీష్, నిర్వహణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ జయప్రదం చేయండి...

విశాలాంధ్ర-ధర్మవరం: మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహ ఆవిష్కరణ ఈనెల 11వ తేదీ ఉన్నందున ఆ కార్యక్రమాన్ని నియోజకవర్గ మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముస్లిం మత గురువు హజ్రత్ సయ్యద్ ఉమర్ ఫారూక్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ బాలుర కాలేజ్ గ్రౌండ్‌లో ప్రజా సమావేశం,బహిరంగ సభకు ముస్లిం మైనార్టీ లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాలు అత్యంత భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లున చెప్పారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు జీవన జ్యోతి పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-ధర్మవరం: అక్టోబర్ 18వ తేదీన అనంతపురం ఆర్.డి.టీ. స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలో ధర్మవరం, జీవన్ జ్యోతి స్కూల్ నందు 9వ తరగతి విద్యార్థులు పి.ఉషశ్రీ, ఎస్. మనుస్మృతి సాయి ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్17 హాకీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ సుజాత తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, 11వ తేదీ నుంచి 13 వ తేది వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరెస్పాండంట్ సిస్టర్ రిన్సీ,హెడ్మిస్ట్రెస్ సిస్టర్ సుజాత,ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు అభినందించారు.

రూ.65 వేల ఆదాయం

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని కొంకల్లు గ్రామపంచాయతీ గల మేకల గట్ట గ్రామంలోని చింత చెట్ల పంటకు బుధవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంపాట డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు నాయక్,పంచాయతీ కార్యదర్శి హరీష్, సర్పంచ్ కవిత ఓబన్నల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన వెంకటరమణప్ప అత్యధికంగా రూ.65 వేలకు చింత చెట్ల పంటను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు రామాంజనేయులు, శివన్న, ప్రసన్న, రంగస్వామి, చింతపండు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పట్టపగలు దొంగతనం...

రూ.1.10లక్షల ల్యాప్ టాప్, సెల్‌ఫోన్ దొంగతనం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని లింగశెట్టిపాళ్యం వీధిలో బుధవారం ఉదయం సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు రూ.1.10లక్షలు విలువ చేసే ల్యాప్టాప్, సెల్ఫోన్ను దొంగతనం చేశారు. బాధితురాలు సాఫ్ట్వేర్ ఉద్యోగి మౌలిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు మౌలిక తెలిపిన వివరాల మేరకు.. లింగశెట్టిపాళ్యం వీధిలో బుధవారం ఉదయం 8గంటల సమయంలో టేబుల్ పైన ల్యాప్టాప్, సెల్ఫోన్ పెట్టి వర్క్ చేసుకుంది. అనంతరం మిద్దెపై పని ఉండటంతో మిద్దెపైకి వెళ్లి వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో తల్లి, తమ్ముడు లోపల గదిలో ఉండటంతో బయట రూమ్ లో టేబుల్ పైన ఉన్న కంపెనీ ల్యాప్టాప్, సెల్ఫోన్‌ను గుర్తు తెలియని దొంగ వచ్చి దొంగతనం చేశాడు. ఇంటికున్న గేటు శబ్దం రావడంతో ఎవరో వచ్చారని ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లి చూడగా గేటు ఓపెన్ చేసి ఉండటంతోపాటు టేబుల్పై ఉన్న ల్యాప్టాప్, సెల్ఫోన్ కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని తెలుసుకుని చుట్టుపక్కల ఎంత వెతికినా దొంగ అచూకి కనిపించలేదు. బాధితురాలు మౌలిక వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

In the court of the civil judge (Senior Division) Penukonda

E.P: 12 / 2021
in O.S 147 / 2014

Between ..

M.Soma Sekhar, S/o M. Narayanappa aged about 43 years, Business Pedda Kammavaripalli(H), H/o Puttaparthy, Puttaparthy Mandal.

... Petitioner / DHR

AND

1. B.T. Ramesh, s/o B.T. Nagaraju aged about 4l years, Business Door No 3-687, S.B.I. Road Puttaparthy
2. Sanga Harish, slo chenna Kesavulu aged about 32 years, Door No. 3/894-A, Puttaparthy.

...*Respondents/JDRS*

వేలం ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయకమేమనగా పై నెంబరు E.P.లోని అర్జీదారుడు ప్రతివాదుల నుండి E.P. మొత్తము రాబట్టుకొనుటకు గాను ఈ క్రింది E.P.షెడ్యూలు ఆస్తులను వేలమునకు గాను అర్జీ దాఖలు చేసినాడు. సదరి E.P.షెడ్యూలు దాఖలా ఆస్తులను 26-12-2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు పైకోర్టు ఎదుట, కోర్టు వారు బహిరంగముగా వేలము వేయుదురు. సదరు వేలములో పాల్గొనదలచిన వారు పాల్గొనవచ్చునని యిందు మూలముగా ఈ యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూలు

Property situated with in the R.D. of Hindupur and S.R.D of Bukkapatnam with in the limits of Puttaparthi Nagara panchayath.
Vacant House site in S.No 289-2. Measurements
East - west 32 meters North-South : 38 feet or 9.69□11.51 Meters or 135.11 square yards
Bounded by :
East 12 feet road, west : A house with D.no 3/596, North : 30 feet road, South : a house D.no 3/571.
DHR value 12,00000.
Amin value 24,00,000.

By order of the Court

అర్జీదారు పరం వకీలు
ఎల్.విశ్వనాథ్
పెనుకొండ, 9440093496

బాల్య వివాహాలు వద్దు..

విశాలాంధ్ర-గాండ్లపెంట : మండలంలో బాల్య వివాహాల నిర్మూలనకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బాల్య వివాహాలు పిల్లల శారీరక-మానసిక అభివృద్ధిని అడ్డుకుం టాయని, అందువల్ల బాలికలు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేసుకుంటేనే సంపూర్ణ పరిపక్వత కలిగి సుఖమైన కుటుంబ జీవితం గడుపుతారని వివరించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, డిప్యూటీ హెచ్ఈఓ విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-గాండ్లపెంట : కటారుపల్లి గ్రామంలో బుధవారం వారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ విత్తన శుద్ధికి ఒక కిలో విత్తనానికి 2 మి.లీ ట్యూబోకానజాల్, 8 గ్రాములు ట్రైకోడర్మా విరిడీ, 2 మి.లీ ఇమిడ క్లోప్రైడ్ వాడాలని అధికారులు సూచించారు. రబీ వేరుశనగ దిగుబడి పెంచేందుకు ఎకరాకు నాలుగు జిప్సం బస్తాలు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఏఓ షాదాబ్, ఎంపిఈఓ యామిని, రైతులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన

విశాలాంధ్ర-గాండ్లపెంట: రెక్కమాను సచివాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిగ్గర్స్ కరిచినప్పుడు ఓరియెంటియా సుత్సుగాముషి బాక్టీరియా ద్వారా వ్యాధి వ్యాపిస్తుందని అధికారులు చెప్పారు. పంటపొలాలు, గడ్డి వాములు, దట్టమైన పొదలు, పచ్చిక బయలులో ఈ నల్లులు కరిచిన చోట నల్లటి ఎస్కార్, జ్వరం, వణుకులు, కండరాల నొప్పులు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. పొడవాటి దుస్తులు, బూట్లు ధరించడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి నగేష్, డిప్యూటీ హెచ్ఈఓ విజయ్‌కుమార్, శిరీష, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం..

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మలకవేముల గ్రామానికి చెందిన బండి పక్కీరప్ప కుమారుడు బండి గంగులప్ప ఈ నెల 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో, బుధవారం ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ గంగులప్ప భార్య బండి రాములమ్మకు రూ. 5 లక్షల చెక్కును అందజేశారు.బండి రాములమ్మ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు, పరిటాల శ్రీరామ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ప్రధానమంత్రి జయంతికి తరలిరండి

విశాలాంధ్ర-పరిగి : దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి జయంతి సందరరేగా నేడు ధర్మవరం పట్టణంలోని కాలేజీ సర్కిల్ నందు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీ కుటుంబ సభ్యులందరూహాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిగి బిజెపి మండల అధ్యక్షుడు ఎన్ఎల్ మూర్తి కోరారు.

ఉపాధ్యాయుల జీతాల నిర్వహణ కొనసాగించాలి

విశాలాంధ్ర-నంబులపూలకుంట : ఉపాధ్యాయుల జీతాలు సేవా పుస్తకాల నిర్వహణ మండల అభివృద్ధి కార్యాలయం నుంచి కొనసాగించాలని మండల ఉపాధ్యాయులు మండల అభివృద్ధి అధికారి పార్థసారథి కి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఎంపిడివో కార్యాలయ సిబ్బంది మాకు కార్యాలయంలో పని భారం ఎక్కువ ఉందని ఉపాధ్యాయుల జీతాలు చేయలేమని చెప్పడం అన్యాయమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు సంబంధించిన పనులు మండల పరిషత్ కార్యాలయం నుండి జరుగుతున్నవని, ఇప్పుడు అర్థాంతరంగా మేము ఈ పనులు చేయలేమనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ విషయాన్ని సీఈఓ, డిఈఓ దృష్టికి తీసుకెళ్లగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ గోపాల్ నాయక్, రాష్ట్ర కౌన్సిలర్ జవహర్, జిల్లా కౌన్సిలర్ రామాంజనేయులు, రెడ్డప్ప, మురళి, గంగాధర్, కాసిం సాహెబ్, రామమోహన్ పాల్గొన్నారు.

అధైర్య పడకండి... అండగా ఉంటాం

విశాలాంధ్ర-తనకల్లు: ఇటీవల వేరు వేరు ప్రమాదాల్లో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులను కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి అధైర్య పడకండి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు తనకలు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు దేశాయి హరినాథ్ రెడ్డి, తనకల్లు మార్కెట్ యార్డ్ చైర్మెన్ భర్త జయ కుమార్ నాయక్, రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి నివాసాలకు వెళ్ళి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోమేనాయక్ తాండ కు చెందిన టీడీపీ కార్యకర్త .రమణ నాయక్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించడంతో వారి నివాసానికి వెళ్లి చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు, పెద్దకడపల వారి పల్లి సొసైటీ అధ్యక్షులు రాజారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు బాగేపల్లి చలపతి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దండువారిపల్లి ఆనంద రెడ్డి, గేమేనాయక్ తండా గ్రామ సర్పంచ్ భర్త సొసైటీ డైరెక్టర్ ఉత్తన్న నాయక్ మాజీ సర్పంచ్ గోవిందు తెలుగుదేశం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సోంపాలెం నాగభూషణం, శ్రీధర్ రెడ్డి శ్రీరాముల నాయక్ ఎస్టి సెల్ శంకర్ నాయక్ మహేష్ నాయక్ బాలాజీ నాయక్ హరినాయక్ జనార్దన్ నాయక్ బాలినేని రవి, శ్రీనివాసులు కమతంపల్లి నాగరాజు, శ్రీనివాసులు, రెడ్డి ఖాన్ నాగరాజు వెంకటేశు గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు నిధులు మంజూరు

విశాలాంధ్ర - అగళి : మండలంలో ముతేపల్లి నుంచి హునిషేకుంట (చింతనకుంట) గ్రామాలకు బిటి రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 79 లక్షలు, ఎచ్‌డి హళ్లి నుంచి కేంకేరా మీదుగా మధూడికి బిటి రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 49 లక్షలు నిధులు మంజూరైనట్లు జడ్పీటీసీ ఉమేష్ మండల పార్టీ కన్వీనర్ తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షులు కుమార్‌స్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కేంచుయాదవ్ మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో మూడు మండలాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆదేశాల మేరకు 11 కోట్ల 31 లక్షల రూపాయలు సీసీ రోడ్లు,బిటి రోడ్లకు నిధులు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. బిటి, సీసీ రోడ్ల నిర్మాణానికి టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో, 11 కోట్ల 31 లక్షల రూపాయలు సీసీ రోడ్లు బీటీ రోడ్లు త్వరలోనే మడకశిర నియోజకవర్గంలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తెలిపారని వివరించారు.

రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-తాడిమర్రి: మండల పరిధిలోని పూల ఓబయ్య పల్లి గ్రామంలో బుధవారం శెట్టిపల్లి నరసింహారెడ్డి 58 రైతు గత కొంతకాలంగా తనకున్న పొలంలో పంటలు సాగు చేస్తూ వచ్చేవాడు కానీ పంటలు సరిగా ఉండకపోగా పండిన పంటకు గిట్టుబాటు ధర రాక అప్పు ఇచ్చిన వారు అడుగుతూ ఉంటే సమాధానం చెప్పుకోలేక చేసిన అప్పులు తీరక అప్పుల బాధతో బుధవారం ఉదయం ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు మృతునికి భార్య ఒక కొడుకు ఒక కూతురు ఉంది.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన, రాజనీతి శాస్త్రం విభాగ అధిపతి గోపాల్ నాయక్, అధ్యాపకులుఎస్ సమీవుల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మన రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన హక్కులను అనుభవిస్తూ, విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్ కుమార్, త్రివేణి ,పావని, భువనేశ్వరి సరస్వతి ఆనంద్ మీనా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో.. ప్రతి ఒక్కరూ వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలి అని, దేశ పౌరులంతా జాతి, కులం, మతం, లింగ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులను కలిగి ఉంటారని జాతీయ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ సుమలత పేర్కొన్నారు. స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం మానవ హక్కుల దినోత్సవం కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మన హక్కులను ప్రతి ఒక్క పౌరుడూ తెలుసుకుని మెలగాలని తెలిపారు. లీగల్ సెల్ టౌన్ ప్రెసిడెంట్ భార్గవి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మానవ హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకునేలా తాము కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల లీగల్ సెల్ ప్రెసిడెంట్ బాల సుందరి కళాశాల ఇంచార్జి రమేష్,పట్టణ మహిళ హక్కుల ప్రెసిడెంట్ ఫర్హాన్ బేగం, జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథులుగా న్యాయవాదులు, హెచ్ఆర్పిసి లీగల్ సేల్ టౌన్ ప్రెసిడెంట్ వైస్ చైర్మన్ భార్గవి, న్యాయవాదులు విజయ రాఘవేంద్ర సుమలత, బాల సుందరి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు వెళ్లిన కన్వీనర్లు..

విశాలాంధ్ర-అగళి : విజయవాడలో గురు, శుక్ర వారల్లో రెండు రోజులపాటు జరిగే కన్వీనర్‌లు, ప్రధాన కార్యదర్శుల శిక్షణ కార్యక్రమానికి మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షులు తిప్పే స్వామి, మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ మడకశిర మండలం నుంచి కల్లుమర్రి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి మారుతీ రెడ్డిలు మంగళవారం సాయంత్రమే బయలుదేరి వెళ్లారు. బుధవారం విజయవాడలోని గన్నవరం విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజుని కలిసారు.

ప్రజా వైద్యం పట్ల పోరాడే హక్కు ఉంది

విశాలాంధ్ర-హిందూపురం : కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ హిందూపురంలో 50,000 సంతకాలు సేకరించి, ఆప్రతులను (200 బుక్కులను) హిందూపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ దీపికా వేణురెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు రమేష్ రెడ్డి, అసెంబ్లీ పరిశీలకులు ఫయాజ్ భాషా, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి తదితరులు జెండా ఊపి జిల్లా కేంద్రానికి బుధవారం పంపారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, పార్టీ అనుబంధ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 11, డిసెంబర్ 2025

హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర-ఉరవకొండ: విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం వజ్ర కరూరు మండలం రాగులపాడు గ్రామం వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, కొనకొండ్ల గ్రామం వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు 20 రోజుల్లోపు పూర్తి చేసి అప్పగించాలన్నారు. రాగులపాడు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పూర్తయ్యే దశలో ఉందని, కొనకొండ్ల విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం 20 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పేమెంట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, భవనాలను పూర్తి చేసి బిల్ అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్పి శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నరేష్, ఏఈ మణిభూషణ్, ఎంపిడిఓ శివాజీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

కసాపురం ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

విశాలాంధ్ర-గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారినిదర్శించుకున్న కలెక్టరు ఓ.ఆనంద్ ని ఆలయ అధికారులు స్వాగతం పలికిన ఆలయ ఈఓ మేడేపల్లి విజయ రాజు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, వేద పండితులు , అర్చకులు మేళ తాళాలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు, ఆలయ అభివృద్ధిలోభాగంగా దాతల ద్వారా మరియు ఆలయ నిధులతో జరుగుతున్న వివిధ పనులను ఈవోతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. దేవస్థానం కార్యనిర్వాహనాధికారితో ప్రస్తుతం జరుగుచున్న అభివృద్ధి నిర్మాణపు పనులపై సమీక్ష చేసి కార్యనిర్వా హనాధికారి వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ దేవస్థానమునకు అవసరమగు మంచి నీరు కొరకు హంద్రీ నీవా కాలువ నుండి పైపే లైన్ ఏర్పాటు చేసి దేవస్థానం వద్ద రెండు లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన నిర్మాణం కొరకు సూపరింటెండెంట్ ఇంజనీరు, హెచ్ ఎన్ ఎస్ ఎస్, మరియు ఎస్ ఈ, ఆర్డబ్ల్యూఎస్ కి ఆదేశములు ఇవ్వడము జరిగింది. భక్తుల సౌకార్యర్థం 40 టాయిలెట్స్ నిర్మాణం చేయుటకు ప్రాజెక్ట్ డైరెక్టర్, డిడబ్ల్యూఎం ఏకి అంచనాలు తయారు చేయవలసినదిగా ఆదేశించారు. దేవస్థానానికి రెండవ రోడ్డు సబ్ స్టేషన్ ప్రక్కనుండి ఏర్పాటు చేయుటకు ఆర్డీవో, తహసీల్దార్,కి ఆదేశలు జారీ చేశారు. దేవస్థానం ద్వారా భక్తులకు అన్నప్రసాద వితరణ కొరకు నిర్మాణం చేయనున్న భవనం కొరకు అవసరమైన స్థలాన్ని కసాపురం గ్రామస్తులతోచర్చించిలనితహసీల్దార్ ,ఎంపీడీఓ లను ఆదేశించారు. శివాలయం ముందుభాగములో రోడ్డు ప్రక్క స్థలాన్ని పూడ్చటానికి అవసరమైన ఏర్పాట్లు చేయవలసినదిగా ఎంపీడీవో కు చెప్పడం జరిగింది. దేవాలయం వెనుక భాగంలో ఉన్న డ్రైనేజీని మద్దికేర రోడ్డు ద్వారా డైవర్ట్ చేయుటకు పిడి, డి డబ్ల్యు ఎంఏ, ఎంపీడివో లను ఆదేశించారు. గుంతకల్లు ఔటస్కెర్ట్ నుండి కొట్టాల నుండి కసాపురం వచ్చు రోడ్డు ను డెవలప్ చేయుటకు విషయం లో అవసరమైన చర్యలు కొరకు తహసీల్దార్ , ఎంపీడివోలను ఆదేశించారు. దేవస్థానం నందు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు డిఇఇ, సోలార్ మరియు డి ఎం, ఎస్.ఆర్ ఇడిసి ఏపీ లను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో , ఎమ్మార్వో,రెవెన్యూ అధికారులు పోలీసులు,ఆలయ అధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణంలో అక్రమాలు

– మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని చెప్పి 80 లక్షల రూపాయలను ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బిల్లులు మంజూరు చేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్యాపిటల్ లిస్ట్ ప్రభుత్వంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అన్యాయులకు సొమ్ము కట్టబెట్టేందుకు అవసరం ఉన్నా లేకున్నా పనులు చేస్తున్న మాటను కోట్లాది రూపాయలు మింగేస్తున్నారన్నారు.పుట్టపర్తిలో సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా నది పరివాహక ప్రాంతానికి ఆనుకుని జోయాలుక్కాస్ సహకారంతో పార్క్ ఏర్పాటు చేసిన ఆ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేసినట్లు మాజీ మంత్రి పల్లె బిల్లులు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు .నిబంధనలకు విరుద్ధంగా ఏ అధికారి వ్యవహరించిన వైసీపీ అధికారంలోకి రాగానే విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. పిపిపి విధానం మాటున రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో అవసరం లేకపోయినా ఔటర్ రింగ్ రోడ్డు మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అస్మదీయు లకు కోట్లు చేకూర్చే పనిలో నిమగ్నమయ్యా రన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, కన్వీనర్ రవి నాయక్, ఈశ్వరయ్య, ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటల రమణారెడ్డి, కౌన్సిలర్ సాయి గీత,నాయకులు నర్సారెడ్డి పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి..

విశాలాంధ్ర-విడపనకల్లు : డోనేకల్లు, కడదరబెంచి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ హెచ్.పెన్నయ్య ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను వివరించారు. ముఖ్యంగా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ 90 శాతం సబ్సిడీతో డ్రిప్ 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్స్ గురించి రైతులకు వివరిస్తూ, డ్రిప్పు 90 శాతం సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీ కి అయితే 100 శాతం సబ్సిడీతో ఇస్తున్నారని కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ తీసుకోవాలని సూచించారు. ఎంపీఈఓ సోమశేఖర్ రైతులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

విశాలాంధ్ర-గాండ్లపెంట: గర్భిణీలు, చిన్నపిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించితే అంటువ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవనం గడపగలరని వైద్య విభాగం అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో టీకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, డిప్యూటీ హెచ్ఈఓ విజయ్‌కుమార్, ఎంఎల్హెచ్‌పీ శిరీష, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు రెడ్డి, భవాని, పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని డిఎంఅండ్‌హెచ్ఓ, ఫైరోజ్ బేగం బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం నమోదవుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సలహాలను సూచనలు అందించారు.

కోటి సంతకాల సేకరణకు స్పందన

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ బుధవారం ఉరవకొండలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో సేకరించిన సంతకాలను ఈనెల 13వ తేదీన అనంత పురంలో ప్రదర్శన చేశామని, 17వ తేదీన పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉరవకొండ ఎంపీపీ నర్సింలు, మాజీ ఎంపీపీ ఏసి ఎర్రిస్వామి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుశీలమ్మ, ఉరవకొండ సర్పంచ్ లలిత, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదినారాయణ అధ్యక్షతన రాజనీతి శాస్త్రం అధ్యాపకులు సిరాజ్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదినారాయణ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సమాజంలో పౌరసత్వము, స్వేచ్ఛ అర్హత, బాధ్యతతో మన హక్కును మనం వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ కే.సుదర్శన్ మాట్లాడుతూ జాతి, లింగం, జాతీయత, మతం వంటి భేదాలు లేకుండా ప్రతి మనిషికి ఉండే ప్రాథమిక హక్కులను, స్వేఛలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో లాయర్ నాగిరెడ్డి ఎన్ ఎస్ ఎస్ పిఓడి శివన్న, శ్రీలేఖ, రవికుమార్ ఆర్ఆర్‌సి జయప్రకాష్, పాల్గొన్నారు.

ఎన్జీవో యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-పెనుకొండ: ఎపి ఎన్‌జిజిఓ అసోసియేషన్ పెనుకొండ తాలూకా యూనిట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సామజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం లో జరిగినవి. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి దేవేంద్ర న త్యసాయి జిల్లా హడా హోక్ కమిటీ మెంబెర్, సహాయ ఎన్నికల అధికారి సూర్య నారాయణ, ఈశ్వర్ నాయక్, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన పెనుకొండ తాలూకా యూనిట్ అధ్యక్షులు మధుబాబు, కార్యదర్శిగా గంగాధర్ కార్యవర్గ సభ్యులు లకు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, ఆడోహోక్ చైర్మన్ లింగా రామ్మోహన్ , అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షలు రవికుమార్, తాలూకా అధ్యక్షులు మధు బాబు సెక్రటరీ గంగాధర్ కు ఎన్నికైన కార్య వర్గ సభ్యులకు జిల్లా కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పంట వ్యర్థాల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-అగళి : మండలంలోని ఇనగలూరు తొననసనపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగాపంట వ్యర్థాలను పొలంలో కలియదన్నడం వల్ల కలిగే లాభాలు కాల్చడం ద్వారా కలిగే నష్టాల గురించి రైతులకు వ్యవసాయధికారి నాగరాజు అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలు భూమికి సహజ పోషకాలు అనివాటిని కాల్చితే నష్టం.భూమిలో కలియ దున్నితే లాభం అని పంట అవశేషాలను కాల్చడం ద్వారా వచ్చే ధూళి, పొగ వల్ల శ్వాస సమస్యలు ఏర్పడతాయన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-నంబులపులకుంట: ఎగువతుపల్లి గ్రామానికి పూర్వం నుండి రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ప్రజా ఫిర్యాదుల వేదికలో గ్రామస్తులు తెలియజేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు ప్రైవేట్ భూములలో 3 కిలోమీటర్ల మేర రోడ్డుకు సంబంధించిన కొలతలు తీసి, భూస్వాముల సమ్మతితో బుధవారం గ్రామపంచాయతీ నిధులతో రోడ్డుపనులను ప్రారంభించారు. సర్పంచ్ చంద్రకళ, తహసీల్దార్ దేవేంద్ర నాయక్, మాజీ సర్పంచులు శ్రీరాములు నాయుడు, నరసింహులు, మాజీ జడ్పీటీసీ పౌల్ రెడ్డిపాల్గొన్నారు

ఆగడం లేదు.. అంతేలేదు..

విశాలాంధ్ర - నార్పల : మండల కేంద్రంలో ఇసుక అక్రమ వ్యాపారం ఆగడం లేదు. ట్రాక్టర్ల ద్వారా నిత్యం పెద్ద మొత్తంలో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ అక్రమ రవాణాకు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నా, మైనింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక రీచ్‌లో ఉంటున్న సెబ్ అధికారులు వీటిని గమనించకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి

విశాలాంధ్ర-కొత్తచెరువు: బుధవారం ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి కొత్తచేరువు మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మొదట గా కొత్తచేరువు లోని గాంధీనగర్ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి, శుభ్రతను పరిశీలించి "భోజనం చాలా బాగుంది" అని ప్రశంసించారు. మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులను సన్మానించారు. పాఠశాల హెడ్ మాస్టర్ మరియు సిబ్బంది ఆమెను అభినందించారు. తదుపరి, జెడ్‌పీ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మట్లాడారు. మెనూ మేరకు భోజనం అందుతున్నదా, నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై విద్యార్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అలాగే కొత్తచేరువు బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యత, పరిమాణం పరిశీలించగా చాలా బాగుంది అని గంజిమల దేవి ప్రశంసించారు. ఈ సందరేగా ఆమె మాట్లాడుతూ.పిల్లల ఆరోగ్యం, పోషకాహారం మా ప్రాధాన్యత. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయం ఏడి శ్రీనివాసరావు, ఎంఈఓ లో జయచంద్ర, సోమశేఖర్, హెచ్ఎంలు నూర్జహాన్, శివయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు మనసాక్షితో ఓటేయండి ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: గత మున్సిపల్ ఎన్నికల్లో కళ్యాణదుర్గం పట్టణంలో 24 వార్డులకు గాను 19 మంది కౌన్సిలర్లు వైసీపీ పార్టీ తరఫున ఫ్యాన్ గుర్తుపై గెలిచామని తాజా రాజకీయ సంక్షోభం నేపథ్యంలో మునిసిపల్ చైర్మన్ ఎన్నిక అనివార్యమైన కారణంగా మనస్సాక్షితో వైసిపి కౌన్సిలర్లు ఓటు వేయాలని పట్టణ కన్వీనర్ సుధీర్ కోరారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొంతమంది వైసిపి కౌన్సిలర్లు టిడిపి లో చేరారని దీన్ని అనుకూలంగా మార్చుకొని తమ పార్టీకి బలం ఉన్నా మున్సిపాలిటీని సంక్షోభంలోకి నెట్టి నూతన చైర్మన్ ను ఎన్నుకోవడానికి ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆయన అనైతిక పద్ధతులను అవలంబిస్తున్నారని ఆరోపించారు. అయితే తమ పార్టీ తరఫున ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు మనసా, వాచా, కర్మణా ఆలోచించి చైర్మన్ అభ్యర్థిగా నిలబడే వ్యక్తికి చేయి ఎత్తి ఓటేయాలని వారు సూచించారు. పార్టీ తరఫున విప్ కూడా జారీ చేశామని దీన్ని అతిక్రమిస్తే చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో తమ కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర టిడిపి కండువా కప్పుకోవడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే అతని గత చరిత్ర ఆలోచించి ఎమ్మెల్యే నిర?యం తీసుకొని ఉంటే బాగుండేదని సలహా ఇచ్చారు. గతంలో పార్టీ మారిన కౌన్సిలర్లు కూడా గురువారం జరిగే చైర్మన్ ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని కోరారు. అనైతిక పద్ధతుల్లో తెలుగుదేశం పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోవాలని చూస్తుందని ప్రజలంతా గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దొడగట్ట నారాయణ, హనుమంతరెడ్డి, నరేంద్ర రెడ్డి, భీమేష్, శివ శంకర్ నాయక్ , హనుమంతరాయుడు , బిక్కిహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైద్యానికి నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అనుమతి లేదని చాలా ఆసుపత్రుల్లో డబ్బు చెల్లించి వైద్యం చేయించుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదు అని సమాధానం ఇస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో గతంలో 25 లక్షల పరిమితికి ఆరోగ్యశ్రీ పెంచితే ఇప్పటి ప్రభుత్వం కేవలం రూ.5 లక్షల నిధులు కూడా చెల్లించలేదని విమర్శించారు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిని వైఎస్సార్సీపీ ప్రభుత్వం 20 రూ. కోట్లతో కొత్త భవనాలు వైద్య పరికరాలు బ్లడ్ బ్యాంక్ డయాలసిస్ సెంటర్ కేటాయించి అబివృద్ధి చేస్తే ఈ కూటమి ప్రభుత్వం కనీసం మందులు డాక్టర్లు కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్ మేధావుల సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి నాయకులు మద్దికెర ప్రతాప్ రఘురామ్ శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-గుంతకల్లు: స్థానిక ఎస్.కే.పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం డిసెంబర్ 10, 2025న మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎ. లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రతి మనిషికి జీవించే హక్కు, సమానత్వం, స్వేచ్ఛ, విద్య, న్యాయం వంటి హక్కులు సహజసిద్ధమైనవని , మానవ హక్కులను గౌరవించడం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని విద్యార్థులకు వివరించారు. రాజకీయ శాస్త్ర విభాగ ఇన్‌చార్జ్ ఎస్. దేవి చైతన్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.రవిశంకర్ శర్మ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలో ఎంపీపీ

విశాలాంధ్ర-విడపనకల్లు : విడపనకల్లు మండల వ్యాప్తంగా గత నెల రోజుల నుండి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంకు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో అనూహ్యస్పందన రావడం జరిగింది. ముగింపుగా నేడు ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీకి వైసీపీ శ్రేణులు వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొని 9250 మంది సంతకాలు చేసిన ప్రతులను నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర్ రెడ్డి, యువనేత వై.ప్రణయ్ రెడ్డికి అందజేశారు. విజయోత్సవ ర్యాలీలో ఎంపీపీ కరణం పుష్పవతి భీమరెడ్డి, మండల కన్వీనర్ కురుబ రమేష్,వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమరెడ్డి, భరత్ రెడ్డి, వైసీపీ కన్వీనర్ బోయ నాగేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

2 అడుగుల దారిలో అంత్యక్రియలు ఎలా..?

విశాలాంధ్ర-యాడికి : యాడికి మండలం లక్షుంపల్లె గ్రామంలో దళిత స్మశాన వాటికకు వెళ్లే దారి కేవలం 2 అడుగుల వెడల్పు ఉన్న మార్గంలోనే అంత్యక్రియల కోసం శవాన్ని తీసుకెళ్లాల్సి వస్తుండటంపై గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు. సమస్యపై సంబంధిత శాఖలను ప్రశ్నిస్తే కోర్టు పరిధిలో ఉంది అని అధికారులు సమాధానమిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం జీవించి ఉన్న మనిషికి ఎంత స్వేచ్ఛ ఉందో, మరణించిన తర్వాత అంత్యక్రియలకు కూడా అదే హక్కులు ఉండాలని స్పష్టంగా పేర్కొనబడింది. అయితే లక్షుంపల్లెలో జరుగుతున్న పరిణామాలు రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్న అభిప్రాయం గ్రామంలో వ్యాప్తి చెందుతోంది. స్మశానానికి పోయే దారి ఏర్పాటుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజు, గిరి, గురప్ప, ఆదినారాయణ, నాగరాజు డిమాండ్ చేస్తున్నారు.

పట్టాదారు పాసుపుస్తకం మంజూరు..

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలో 2024 డిసెంబర్ నెల లోపు అంత కంటే పూర్వం సదాబైనమల (తెల్లకాగితంలో అగ్రిమెంట్ తరహాలో) సంబంధించిన భూములు రాయించుకున్న వాటికి శాశ్వతంగా యజమాని పేరు మీదా పట్టాదారు పసుపుస్తకం మంజూరు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు తహసీల్దార్ షేక్షవాలి తెలిపారు. ఆలాంటి రైతులు ఎవరైన ఉంటే 2027 డిసెంబర్ 31లోపు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అర్జీల ద్వారా సమర్పించుకోవాలని తెలిపారు.భూమి అర్హత వర్గీకరణ వంటి అంశాలను తహసీల్దార్ స్థాయి విచారణ ద్వారా నిర్ధారించబడుతుందని తెలియజేశారు. రత్నగిరి రెవెన్యూ గ్రామం పరిధిలోని భూములను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప,రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు..

అనాథ ఆశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-గోరంట్ల: ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని గోరంట్ల మండలంలోని మంజుల ఉమెన్ వెలోర్ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం, అనాథాశ్రమంలో నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్, నేషనల్ జనరల్ సెక్రటరీ స్వప్న పాలక ఆదేశాల మేరకు అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బి.రాజేశ్వరి ఏపీ స్టేట్ ఉమెన్ పోర్ట్ ఇంచార్జ్, రెడ్డివారి రాజారెడ్డి రాయలసీమ జనరల్ సెక్రెటరీ (గోరంట్ల వైస్ ప్రెసిడెంట్),ప్రెసిడెంట్ సంధ్య జ్యోతి ఉమెన్ శ్రీ సత్యసాయి డిస్టిక్ ఇన్చార్జ్ వింగ్,ఉమెన్ బెస్త కళ్యాణి శ్రీ సత్యసాయి జిల్లా ఉమెన్ జనరల్ సెక్రెటరీ, రాయలసీమ చైర్మన్ బి.ఎస్ మూర్తి, రాయలసీమ మీడియా సెక్రెటరీ బి.శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్ రాయలసీమ కన్వీనర్, పెనుకొండ మండల ప్రెసిడెంట్ మహబూబ్ బాషా,కె.హరీష్ సత్య సాయి వైస్ ప్రసిడెంట్ ఎన్ హెచ్ ఆర్‌సి సభ్యులు విజయ్ కుమార్, ప్రవీణ్ అన్నదాన కార్యక్రమం చేశారు.

జనన ధ్రువీకరణ స్కాంపై ఫిర్యాదు

విశాలాంధ్ర-అగళి : మండలంలోని కొమరేపల్లి గ్రామ సచివాలయం లో జరిగిన జనన ధ్రువీకరణ పత్రాల స్కాంపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎం అండ్ హెచ్ ఓ ఫైరోజా బేగం బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ నిమిత్తం వచ్చిన డిఎం ఎచ్ జనన ధ్రువీకరణ స్కాం పై ఆమె మాట్లాడారు. కేవలం 10 నెలల వ్యవధి లోనే దాదాపు 3982 జనన ధ్రువీకరణ పత్రాలు జారీ కావడంపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, దీనిపై త్వరలో ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు వివరాలు తెలుస్తాయని తెలిపారు.

ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

విశాలాంధ్ర-పెనుకొండ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా శ్రీ సత్య సాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేసిన పత్రాలను పెనుకొండ మెడికల్ కాలేజీ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించే కార్యక్రమంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉషాశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడుతూ జగన్ తీసుకొచ్చిన మెడికల్ కాలేజ్ లను కమీషన్స్ కోసం టీడీపీ ప్రైవేటుకి ఇస్తున్నదని ధ్వజమెత్తారు. 17వ తేదీ జగన్ మోహన్ రెడ్డి గవర్నర్‌ని కలుస్తామన్నారు. పెనుకొండలో దాదాపు 60 ఎకరాలకు పైగా విస్తీర?ంలో మెడికల్ కాలేజ్ ఉండగా ఎకరానికి 100 రూపాయలకే వాటిని ప్రవేట్ వ్యక్తులకు దార దత్తం చేస్తుంటే, ఇక్కడున్న మంత్రి సవిత కమిషన్లకు కక్కుర్తి పడి అమ్మడానికి సిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సుధాకర్ రెడ్డి,పట్టణ కన్వీనర్ నరసింహ, తిమ్మయ్య,గజేంద్ర, జడ్పిటిసి ఎంపీపీలో సర్పంచులు ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్సిపి ప్రతినిధులు పాల్గొన్నారు.

కోటి సంతకాల పత్రాలతో బుద్ధి చెప్తాం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన సంతకాల సేకరణ పత్రాలను గవర్నర్‌కు పంపుతామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కు తగిన గుణపాఠం చెప్తామని వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. కోటి సంతకాలతో కూడిన పత్రాలను కళ్యాణదుర్గం లోని వైసీపీ కార్యాలయం నుండి అనంతపురం జిల్లా వైసీపీ కార్యాలయానికి గురువారం తరలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, వైసీపీ పట్టణ కన్వీనర్ సుధీర్, నాయకులు హనుమంతరెడ్డి, నరేంద్రరెడ్డి, భీమేష్, హనుమంతరాయుడు, డీసీ పల్లి నరేష్, పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామ లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం పారిశుద్ధ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు . లయన్స్ క్లబ్ సభ్యుడు సిలారు రాజశేఖర్ పారిశుద్ధ కార్మికులకు దుస్తులు అందించగా, ఎల్ఐసి ప్రసాద్ చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవలను కొనియాడరు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ శెట్టి, ట్రెజరర్ అల్లా బకాష్, రవి ప్రసాద్, సత్యనారాయణ, కూచి సూర్యనారాయణ, కులశేఖర్, రామకృష్ణ, రాజశేఖర్, పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని,పార్లమెంటులో ఆర్ టి ఈ యాక్ట్ సెక్షన్ 23(1)ను అమెండ్మెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, సింగల్ టీచర్ సమస్యలు పరిష్కరించాలని, ఇప్పటికే బదిలీలు పొంది వారి స్థానాలలో కొత్తవారు రాక అక్కడే కొనసాగుతున్న టీచర్లను వెంటనే బదిలీ అయిన స్థానాలకు రిలీవ్ చేయాలని, అదేవిధంగా రెండవ శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించ వద్దని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కాలేజ్ సర్కిల్ నుండి ఆర్డిఓ ఆఫీస్ ఎదుట వరకు ప్రదర్శనగా వెళ్లి అనంతరం ధర్మవరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్, ధర్మవరం డివిజన్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, లక్ష్మయ్య ,సురేష్ ,చంద్రశేఖర్, రాంప్రసాద్, లతాదేవి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

జన సైనికులతోనే పార్టీ అభివృద్ధి

విశాలాంధ్ర-తాడిపత్రి: జనసైనికులతోనే జనసేన పార్టీ అభివ ృద్ధి అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి జనసేన పార్టీ ఆఫీసులో నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తాడిపత్రి జనసైనికులు రాయలసీమ ఎలక్షన్ జోన్ కమిటీ మెంబర్ ఆటో ప్రసాద్, జనసేన పార్టీ జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు అచ్చుకట్ల అల్తాఫ్ మర్యాదపూర్వకంగా కళ్యాణం శివ శ్రీనివాసరావును కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విగ్రహ స్థలంపై వివాదం పరిష్కారం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలో గత రెండు రోజులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్థల సేకరణ విషయంలో చిన్న సమస్య రావడంతో తహసిల్దార్ ప్రతాప రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి సూచనలతో స్థల వివాదానికి తెరదించారు. స్థానిక కృష్ణ దేవరాయలు ఎన్టీఆర్ విగ్రహాల ప్రక్కన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతించారు. స్థానిక టిడిపి నాయకుల, ఎమ్మార్పీఎస్ నాయకుల సమక్షంలో ఎట్టకేలకు విగ్రహ భూమి పూజను నిర్వహించారు. విగ్రహానికి అనుమతి ఇచ్చినందుకు ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట-మంతి కార్యక్రమం వీక్షింపు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన మాట మంతి ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం' మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన, లైవ్ టెలికాస్టో అధికారులంతా శ్రద్ధగా వీక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణ ఉద్యోగులతో మాట మంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, పాలనా విధానాలు, గ్రామస్థాయి సమస్యలు పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు బాధ్యతాయుత పరి పాలనపై పవన్ కళ్యాణ్ చేసిన సూచనలపై అధికారులు దృష్టి పెట్టారు. ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ రమణ. పంచాయతీ కార్యదర్శులు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.